క్లుప్తంగా

న్యాయం చేయండి



మాట్లాడుతున్న వీరాస్వామి

నెల్లూరురూరల్ : కండలేరు ముంపు వాసులకు ప్రభుత్వం 1999వ సంవత్సరంలో రెండున్నర ఎకరాలను తన పేరుతో పట్టా ఇచ్చారని, ఇప్పుడు తన తమ్ముడు మోసం చేసి అతని పేరుపై మార్చుకున్నాడని రాపూరు మండలం పెనుబర్తి గ్రామానికి చెందిన బి.వీరాస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పట్లో భూమి తనకు, తమ్ముడికి కండలేరులో ఉద్యోగం ఇచ్చారన్నారు. చదువుకున్న మా తమ్ముడు చిన్న వీరస్వామి నాకు తెలియకుండా రెవెన్యూ ఉద్యోగులతో కుమ్మక్కై ౕ మార్చుకున్నాడని వాపోయారు. నాకు ఆ భూమి మాత్రమే దిక్కు అని, అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

జెడ్పీ సీఈఓ పరిశీలన



నెల్లూరు సిటీ : రూరల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి(జెడ్పీ సీఈఓ) ఎం.విద్యారమ గురువారం పరిశీలించారు. కార్యాలయంలోని పలు ఫైల్స్‌ను తనిఖీ చేశారు. అనంతరం వివిధ ప్రభుత్వ సర్వేల పురోగతిపై అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ శైలేంద్ర కుమార్ పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి నూతన కారు విడుదల



నెల్లూరు (టౌన్) : నగరంలోని బాలాజీ ఏజెన్సీస్ అండ్ ఇండస్ట్రీస్‌లో మహేంద్ర కంపెనీకి చెందిన బీఈ6, ఎక్స్‌ఈ వీ9 వాహనాన్ని ఎంవీఐ బాలమురళీ చేతుల మీదుగా గురువారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. కార్యక్రమంలో సీఈఓ నరేంద్రనాథ్, సేల్స్ జీఎం శ్రీధర్ బాబు, సర్వీస్ జీఎం ఉమామహేశ్వరరావు, ఫైనాన్షియర్స్, సేల్స్ మేనేజర్స్ పాల్గొన్నారు.

నెల్లూరు ఆర్డీఓ పర్యటన


స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ అనూష

తోటపల్లిగూడూరు: నెల్లూరు ఆర్డీఓ అనూష గురువారం మండలంలోని వరిగొండ, తోటపల్లిగూడూరు బిట్ - 2 గ్రామాల్లో పర్యటించారు. భూ క్రమబద్ధీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా గుర్తించేందుకు ప్రభుత్వం భూ క్రమబద్ధీకరణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన భూములను వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. రికార్డుల పరంగా ఇబ్బందులున్న భూముల గురించి తమ దృష్టి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ కృష్ణప్రసాద్, టీడీ శివయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూపై భయం వద్దు

- పశుసంవర్థక శాఖ జేడీ రమేష్ నాయక్

మనుబోలు: బర్డ్‌ఫ్లూపై ఆందోళన చెందొద్దని, ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా ఆ వ్యాధి ఉన్నట్లు నమోదు కాలేదని పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్ నాయక్ తెలిపారు. మనుబోలులోని ప్రాంతీయ పశువైద్యశాలకు ఆయన గురువారం విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉడికించిన చికెన్, కోడిగుడ్లను తినొచ్చన్నారు. జిల్లాలో ఉన్న 19 పౌల్ట్రీ ఫారాలను వైద్యులు పరిశీలించి ఎక్కడా బర్డ్‌ఫ్లూ లేదని నిర్ధారించారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏడుచోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఇతర జిల్లాల నుంచి కోళ్లను రవాణా చేయకుండా అడ్డుకుంటున్నామని తెలిపారు. మనుబోలు మండల పరిధిలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద కూడా చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పలు రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఏడీ గురవారెడ్డి ఉన్నారు.

డిగ్రీ పరీక్షలకు ఇద్దరు విద్యార్థుల గైర్హాజరు

వెంకటాచలం : విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ మొదటి, నాలుగో సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు తెలిపారు. 24 మందికి గానూ 22 మంది పరీక్షలు రాశారన్నారు.

నిఘా నేత్రం వెంటాడుతోంది

- నేరాల కట్టడిలో డ్రోన్స్ ఆన్ డ్యూటీ
- అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం
- బహిరంగ మద్య సేవనంపై 48 కేసులు
- 12 మంది జూదరుల అరెస్ట్

బహిరంగ ప్రదేశాలు, నిర్మానుష్య ప్రాంతాల్లో మద్యసేవనం చేస్తున్నా, మత్తు పదార్థాలు తీసుకుంటున్నా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్నా, పేకాట ఆడుతున్నా.. నిఘా నేత్రం వెంటాడుతుంది. డ్రోన్స్ ఆన్ డ్యూటీలో ఉంటూ తప్పు చేసేవారిని పట్టుకుంటున్నాయి. మీ ప్రతి కదలికలను రికార్డు చేసి కటకటాల పాలుచేస్తుంది. తస్మాత్ జాగ్రత్త అంటూ పోలీసులు హెచ్చరిస్తున్నారు. నగరంలో డ్రోన్‌లను ఉపయోగించి అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.


సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆకతాయిలను గుర్తించిన డ్రోన్


డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న నగర డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైమ్) : గత కొంతకాలంగా నగరంలో అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు పెరిగిపోయాయి. ఏరులై పారుతున్న మద్యం వల్ల శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడుతోంది. వీటిని కట్టడి చేసేందుకు ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు నగర డీఎస్పీ పి.సింధుప్రియ పటిష్ట చర్యలు చేపట్టారు. నగరంలో నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు అధికంగా జరిగే ప్రదేశాలు, శివారు ప్రాంతాలను డ్రోన్ల నిఘా నీడలోకి తీసుకొచ్చారు. తాము వెళ్లలేని ప్రాంతాలకు డ్రోన్లను పంపి పరిశీలిస్తున్నారు. బహిరంగ మద్యసేవనం, గంజాయి వినియోగం, పేకాట, గంజాయి విక్రయాలు, అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్‌పై కొరడా ఝుళిపిస్తున్నారు. డ్రోన్ల శబ్దం విన్న మందుబాబులు, అక్రమార్కులు పరుగులు తీస్తున్నారు. మరోవైపు పాడుబడిన బంగ్లాలు, తోటలు, పార్కులు, నదీతీర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో పలు చిత్రాలు తీసి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తున్నారు.

కేసుల నమోదు ఇలా..

నగరంలో డ్రోన్ల సాయంతో అసాంఘిక కార్యకలాపాలకు పోలీసులు చెక్ పెడుతున్నారు. బుధవారం నుంచి ఇప్పటి వరకు బహిరంగ మద్యసేవనంపై 48 కేసులు నమోదు చేసి మందుబాబులను అరెస్ట్ చేశారు. రెండు పేకాట స్థావరాలపై దాడులు చేసి 12 మంది జూదరులను అరెస్ట్ చేశారు. గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈవ్‌టీజర్లను అదుపులోకి తీసుకుని వారికి తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలు, నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

నేర నియంత్రణే లక్ష్యం

అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన డ్రోన్ల సాయంతో నేరాల కట్టడికి చర్యలు చేపట్టాం. నెల్లూరు నగరాన్ని నిఘా నీడలోకి తీసుకొచ్చి బహిరంగ, నిర్మానుష్య, శివారు ప్రాంతాలను నిశితంగా పరిశీలిస్తున్నాం. బహిరంగ మద్యసేవనం, ఈవ్‌టీజింగ్, పేకాట, గంజాయి విక్రయాలపై కేసులను నమోదు చేస్తున్నాం. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం.

– జి.కృష్ణకాంత్ ఎస్పీ


శివారు ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు


డ్రోన్‌ల సాయంతో పరిశీలిస్తున్న పోలీసులు

మాజీ సీఎంను కలిసిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నెల్లూరు ఘటనను వివరిస్తున్న పర్వతరెడ్డి

నెల్లూరు(బారకాసు) : కూటమి ప్రభుత్వం నగరంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్న వైనాన్ని ఎమ్మెల్సీ, సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు తాడేపల్లిలోని ఆయన నివాసంలో గురువారం కలిసి పలు అంశాలను వివరించారు. ఇటీవల 15వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ కార్యకర్త బాలకృష్ణారెడ్డి ఇంటిని కూల్చివేసిన విషయాన్ని మాజీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నగరంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అరాచకాలను వివరించారు.

మర్యాదపూర్వకంగా...

నెల్లూరు(సెంట్రల్) : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆప్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నెల్లూరు (టౌన్) : స్థానిక కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ రేడియో దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి మహేంధర్‌రెడ్డి, పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు మురళీమోహన్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, హెచ్ఎం భాస్కరరావు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రాక్టికల్స్ నిర్వహణలో ఆర్ఐఓ విఫలం


డీఆర్వోకు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు

నెల్లూరు(అర్బన్) : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఆర్ఐఓ విఫలం చెందారని విద్యార్థి జేఏసీ నాయకులు ఆరోపించారు. ఈమేరకు కలెక్టరేట్‌లో డీఆర్వో ఉదయభాస్కర్‌రావుకు వారు గురువారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యసాయి మాట్లాడుతూ ప్రతి ప్రైవేటు జూనియర్ కళాశాలలో మాస్ కాపీయింగ్ జరుగుతోందన్నారు. కళాశాలల యాజమాన్యాలే కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. గతంలో ఉన్న జంబ్లింగ్ విధానాన్ని రద్దు చేసి సెల్ఫ్ సెంటర్ల ద్వారా ప్రాక్టికల్స్ నిర్వహించడం వల్ల మాస్ కాపీయింగ్ విచ్చలవిడిగా జరుగుతోందన్నారు. దీనిపై ఆర్ఐఓ కళాశాలల యాజమాన్యాలకు వంత పాడుతున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారుతున్నాయన్నారు. ఇప్పటికైనా మాస్ కాపియింగ్‌ను అరికట్టకపోతే ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లీలామోహన్ పాల్గొన్నారు.

రూ.191 కోట్లతో అభివృద్ధి పనులు

- సెల్ఫీ వీడియోలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలో రూ.191 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గురువారం ఓ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లో రూరల్ నియోజకవర్గంలో రూ.191 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, కొన్ని పనులు పూర్తి కాగా, మరికొన్ని పనులు జరుగుతున్నాయన్నారు. పొట్టేపాళెం కలుజు మీద వంతెన మంజూరు చేయించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. హైవే వద్ద చింతారెడ్డిపాళెం కూడలి నుంచి చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జ్ మంజూరుకు తన వంతు కృషి చేస్తున్నట్లు వివరించారు.

పేద దంపతులకు పెద్ద కష్టం

- రెండు కిడ్నీలు పాడైపోయిన భర్త
- షుగర్ తీవ్రమై మంచానికే పరిమితమైన భార్య
- సాయం కోసం ఎదురుచూపులు


సుబ్రహ్మణ్యం

మనుబోలు : రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు వారివి. భర్తకు రెండు కిడ్నీలు పాడైపోయాయి. భార్యకు షుగర్ అధికమై తీవ్ర అనారోగ్యం బారిన పడి మంచానికే పరిమితమైపోయింది. దీంతో వారికి పూట గడవడమే గగనమైంది. ఈ నేపథ్యంలో దాతల కోసం ఎదురుచూస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. మనుబోలు మండల కేంద్రంలోని గమళ్లపాళెంలో కుడమల సుబ్రహ్మణ్యం, లక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు సంతానం. ఇద్దరికి వివాహమైంది. కాగా సుబ్రహ్మణ్యం కల్లుగీత కార్మికుడు. కొంతకాలం క్రితం చెట్లు ఎక్కలేక గీత పనేసి సిమెంట్ బ్రిక్స్ తయారీ ఫ్యాక్టరీలో పనికి వెళ్లేవాడు. ఇటీవల ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించగా రెండు కిడ్నీలు పాడైపోయాయని వైద్యులు తెలిపారు. దీంతో వారానికి రెండు సార్లు డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ప్రభుత్వం డయాలసిస్ పేషెంట్లకు ఇచ్చే పింఛన్ కూడా ఈయనకు రావడం లేదు. దీంతో వైద్యం కోసం అప్పులు చేస్తున్న పరిస్థితి ఉంది. సుబ్రహ్మణ్యం భార్య లక్ష్మీకి షుగర్ ఉంది. అది అధికమై కాళ్లకు ఇన్‌ఫెక్షన్ సోకి మంచానికే పరిమితమైంది. ప్రభుత్వం, దాతలు స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 94919 12838


లక్ష్మి

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి

విడవలూరు : స్థానిక పీఆర్ఆర్-వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగే ఉద్యోగ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో డైకిన్, హీరో మోటార్స్ సంస్థల ప్రతినిధులు విచ్చేసి అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో శనివారం ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ శ్రీరామమూర్తిని సంప్రదించాలన్నారు.

ప్రణతికి డాక్టరేట్



నెల్లూరు (టౌన్) : జిల్లాకు చెందిన ఒ.ప్రణతికి డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్)లో ప్రొఫెసర్ బలరాములు పర్యవేక్షణలో రాజకీయాల్లో మహిళలు పోషిస్తున్న పాత్ర, అడ్డంకులు, వారి ప్రాధన్యతా మూలాలపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ వచ్చిందని ఆమె గురువారం చెప్పారు.

భక్తిశ్రద్ధలతో షబ్-ఎ-బరాత్


విద్యుద్దీపకాంతుల్లో కోటమిట్టలోని అమీనియా మసీదు

నెల్లూరు(బృందావనం) : ముస్లింల పవిత్ర రాత్రి 'షబ్-ఎ-బరాత్'ను గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక దువా చేశారు. అలాగే తమ పూర్వీకుల సమాధులను సందర్శించి ప్రార్థనలు, ఉపవాసం చేశారు. తాము చేసిన ప్రార్థనలను అల్లాహ్ స్వీకరించి తమ వారిని ఆశీర్వదిస్తారని, అలాగే పెద్దల ఆశీస్సులు అందుతాయని వారి విశ్వాసం. ముస్లిం మతపెద్దలు తెలిపిన మేరకు.. ఇస్లామిక్ సంప్రదాయాలను అనుసరించి షియా ముస్లింలు 12వ ఇమామ్ మొహ్మద్ అల్-మహ్ది ఈ రాత్రి జన్మించారని విశ్వసిస్తారు. అలాగే సున్నీలు షబ్-ఎ-బరాత్‌ను క్షమాపణ రాత్రిగా భావిస్తారన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు


గర్భిణులతో డాక్టర్, సిబ్బంది

నెల్లూరు(అర్బన్) : నగరంలోని వెంగళరావునగర్ అర్బన్‌హెల్త్ సెంటర్‌లో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్లు, ఇతర తినుబండారాలను పంచిపెట్టారు. అనంతరం వైద్యాధికారిణి డాక్టర్ రీనాభారతి మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకం ద్వారా గర్భిణులకు అవసరమైన అన్నిరకాల పరీక్షలు చేయించి మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. సకాలంలో గర్భిణులు, శిశువులు, బాలింతలకు టీకాలు వేసి ఆరోగ్య రక్షణకు కృషి చేస్తున్నామన్నారు. ఈ పథకం కింద కాన్పు చేయించుకున్న మహిళలకు పట్టణ ప్రాంతాల్లో రూ.5 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.6 వేలు అందజేస్తున్నట్లు వివరించారు. ఈనెల 29వ తేదీ వరకు ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి గర్భిణులను గుర్తిస్తామన్నారు. రెండేళ్లలోపు చిన్నారులను కూడా గుర్తించి అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పౌష్టికాహారం అందజేస్తామన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిపొందాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

నెల్లూరు(బృందావనం) : పడారుపల్లి దివ్యాంగుల కాలనీలోని ఆచార్య పీసీరెడ్డి సమాజ మందిరంలో క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులు, పేదలకు గురువారం వస్త్ర, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే పలువురికి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు వెంకటలక్ష్మి మాట్లాడుతూ దుంపా హరనాథ్‌రెడ్డి- విజయలక్ష్మి దంపతుల సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. బాబులురెడ్డి, తంబయ్యనాయుడు, కవితారెడ్డి, కొండేటి సుధాకర్‌రాజు, మమతారెడ్డి,



దగ్గుపాటి రాధాకృష్ణ, పి.పద్మ, వై.ఉమాదేవి, గుమ్మడి రాజగోపాలరెడ్డి, లక్ష్మి పాల్గొన్నారు.

పెన్‌కాక్ సిలాట్‌లో విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు (టౌన్) : తమిళనాడులో ఈనెల 5, 6, 7వ తేదీల్లో జరిగిన అస్మిత పెన్‌కాక్ సిలాట్ లీగ్ సౌత్‌జోన్ పోటీల్లో నెల్లూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. కళాశాల విద్యార్థులు ఎస్.నిఖిల, పి.హారిక, తనూష అనే విద్యార్థినులు రజత, కాంస్య పతకాలను సాధించినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురువారం కళాశాలలో అభినందించారు. అనంతరం మాట్లాడుతూ 2018 నుంచి నారాయణ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించారన్నారు. 2023–24లో 22 గోల్డ్, 36 సిల్వర్, 32 బ్రాంజ్ పతకాలు సాధించారన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్స్ ప్రసాద్, అనూరాధ, ఈసీఈ హెడ్ మురళీ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ యాజమాన్యం

జలవనరుల నిర్వహణకు నిధులు కేటాయించాలి

నెల్లూరురూరల్ : జలవనరుల శాఖ సాంకేతిక సలహాదారు కన్నయ్యనాయుడు సోమశిల డ్యామ్‌ను పరిశీలించి డ్యామ్ గేట్ల రోప్‌లు దెబ్బతిన్నట్లు వెల్లడించారని, దీనిపై సీఎం చంద్రబాబుకు బహిరంగలేఖ రాసినట్లు బీజేపీ నేత మిడతల రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ వాస్తవానికి సోమశిల, కండలేరు, రాళ్లపాడు ప్రాజెక్టుల్లో ఇవే సమస్యలు ఉన్నాయన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం జలవనరుల నిర్వహణకు నిధులు కేటాయించి తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు.


మాట్లాడుతున్న బీజేపీ నేత మిడతల రమేష్